క్లుప్తంగా

భవానీలకు పండ్లు, జ్యూస్ పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గిరి ప్రదక్షిణలో భవానీలకు పండ్లు, జ్యూస్‌ను గత 24 ఏళ్లుగా పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జాయింట్ సెక్రటరీ, శ్రీకాంత్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పిళ్లా దుర్గారావు ఆధ్వర్యంలో బుధవారం బంగారయ్య కొట్టు సెంటర్‌లో భవానీలకు పండ్ల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, చైతన్యరెడ్డి, గుడివాడ నరేంద్ర పాల్గొన్నారు. తొలుత అమ్మవారి ప్రతిమకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం అతిథులు భవానీలకు పండ్లు, జ్యూస్ బాటిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థాన పాలక మండలి సభ్యుడు గురుమహంతు మహేష్, కట్టా సురేష్, ప్రభుదాస్, లోకేష్, జ్యోతి, జనార్దన్, హనుమంతరావు, పిళ్లా సూరిబాబు(జగ్గు) పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామివారి మందిరంలో బుధవారం శ్రీమణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. గురు స్వామి బల్లెం పూర్ణయ్య స్వామి స్వామివారికి పంచామృత అభిషేకం, నెయ్యాభిషేకం నిర్వహించి హారతులు ఇచ్చారు. మధ్యాహ్నం సుమారు 200 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో స్వాములు, భవానీలు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

8న సహస్ర దీపాలంకరణ సేవ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 8వ తేదీ సాయంత్రం ధనుర్మాసోత్సవాలలో భాగంగా శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన సహస్రదీపాలంకరణసేవ నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 6.30 గంటలకు వేంకటేశ్వరస్వామివారికి విశేషంగా సహస్రదీపాలంకరణ సేవ జరుగుతుందన్నారు.

వైభవంగా దీపోత్సవం



విజయవాడ కల్చరల్: దుర్గాపురంలోని శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలో పవిత్ర ధనుర్మాసం సందర్భంగా దీపోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం ఉదయం వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి రంగనాథులకు పవిత్రమైన పాశురాలను అర్చక స్వాములు గానం చేశారు. 10 వేల దీపాలతో వేంకటేశ్వరుని తిరునామాలు, త్రిశూలం ఆదిశంకరులకు, పార్వతీదేవి, పరమేశ్వరుడు దేవాలయాల ప్రాంగణంలో దీపార్చన వేడుకగా నిర్వహించారు. భక్తుల గోవింద నామాలతో పరిసరాలు ప్రతిధ్వనించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్ నిర్వహించారు.

బీమా నగదు అందజేత



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ 24వ బ్లాక్ ప్రాంతంలోని బచ్చలకూరి కొండయ్య బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత సమస్యతో బాధపడుతున్న కొండయ్య బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. విషయం తెలిసిన వెంటనే 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షహీన సుల్తానా హఫీజుల్లా కొండయ్య పార్థీవ దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి వైఎస్సార్ బీమాలో మంజూరైన లక్ష రూపాయలలో పది వేలు అందజేశారు. మిగిలిన రూ. 90వేలు త్వరలో నేరుగా బ్యాంక్ అకౌంట్‌లో జమ అవుతాయని తెలిపారు.

దారులన్నీ.. అమ్మ సన్నిధికే



ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సుదూర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో విచ్చేసిన భవానీ మాలధారులు అమ్మ సన్నిధికి చేరుకున్నారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ వారిని దర్శించుకుని, భక్తిశ్రద్ధలతో ఇరుముడులను సమర్పించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ











ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి



సత్కారం అందుకున్న టీచర్లతో శ్రీకాంత్ తదితరులు



గొల్లపూడి స్కూల్‌లో నివాళులర్పిస్తున్న సత్యనారాయణ, విద్యార్థులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కులవివక్షత, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీర వనిత సావిత్రీబాయి పూలే అని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో గల ఆయన చాంబర్‌లో బుధవారం వేడుకలు జరిగాయి. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముగ్గురు ప్రభుత్వ మహిళా ఉపాధ్యాయునులు శైలజ, జ్యోతి, సాయి మున్నీసాలను సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి తద్వారా వారి అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ విశ్వబ్రాహ్మణ మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, ఏపీ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి చిట్టూరి హరీష్, బీసీ నాయకులు కోసూరి రమేష్, కె.సతీష్, వై.సత్యనారాయణ, పి.రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్‌లో

జాతీయ మహిళా ఉపాధ్యాయునుల దినోత్సవం సందర్భంగా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా అకాడమీ హైస్కూల్ సావిత్రీబాయి పూలే జయంతి



సత్కారం పొందిన టీచర్లతో నిర్వాహకులు

వేడుకలు జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్ ఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని నమ్మి దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారిగా స్త్రీ విద్యను ప్రవేశపెట్టిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే అన్నారు.కార్యక్రమంలో స్కూల్ కమిటీ సెక్రటరీ, ఉపాధ్యక్షుడు ఆర్.గోపాలం, ట్రెజరర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ఏపీ పీటీడీ(ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయునులు పి.అమృత, పి.ఝాన్సీ, లక్ష్మిలకు సావిత్రీబాయి పూలే స్ఫూర్తి పురస్కారాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో చాత్తాద శ్రీవైష్ణవ మహిళా నాయకురాలు ఎస్వీ యశోద, నాయకులు టి.పూర్ణయ్య, బీసీ సంఘ నాయకులు కె.నాగమల్లేశ్వరరావు, యు.ఈశ్వర్ రాజు, వీజె రత్నం, ఎం.మోజేష్, ఇ.ప్రమీల, ఎం.దుర్గ, బి.ఆంజనేయులు, ఎ.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రీబాయి పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిట్టినగర్ శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమానికి బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు ఎస్వీ.రావు అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు గోగుల వెంకట రమణ ప్రారంభ ఉపన్యాసం చేశారు. తొలుత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూజా కార్యక్రమాలను నిర్వహించి నివాళులర్పించారు. బీసీ నాయకులు తట్టి అర్జునరావు, దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, పరివస్తు చిన్నయసూరి పీఠం అధ్యక్షుడు టి.శోభనాద్రి, మల్లికార్జునయాదవ్, కొత్త అమ్మవారి దేవస్థాన కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, బీసీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది పిళ్లా రవి, బుద్దా నాగేశ్వరరావు ప్రసంగించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని సత్కరించారు. మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు.

దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన



మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న సీపీ రాణా, ఈవో, పోలీస్ అధికారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్షల విరమణ కోసం ఇంద్రకీలాద్రికి విచ్చేసే భవానీలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ టి.కె.రాణా ఆదేశించారు. ఇంద్రకీలాద్రిపై భవానీ దీక్ష విరమణ ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ రాణా బుధవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, హోమగుండాలు, ఇరుముడి సమర్పించే కౌంటర్లు, ప్రసాదం కౌంటర్లు, మెట్ల మార్గం, ట్రాఫిక్ మళ్లింపు వంటి ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని సిబ్బందితో పేర్కొన్నారు. అమ్మవారి దర్శనం పూర్తి చేసుకుని కొండ దిగువకు చేరుకున్న భవానీలతో సీపీ మాట్లాడారు. గిరి ప్రదక్షిణ మార్గంలో ఏమైనా ఇబ్బందులు ఎదరయ్యాయా అని అడిగి తెలుసుకున్నారు. సీపీ వెంట డీఐజీ విశాల్‌గున్ని, అడ్మిన్ డీసీపీ మోకా సత్తిబాబు, దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు, ఏసీపీ హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతనంగా 339 మందికి పెన్షన్లు అందజేత



నూతన పెన్షన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ.3 వేల పెన్షన్‌తో పాటు పశ్చిమ నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన 339 మందికి పెన్షన్లు అందిస్తున్నామని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలో బుధవారం నియోజకవర్గంలో నూతనంగా మంజూరైన పెన్షన్ దారులకు నగదు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే వెలంపల్లి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జగనన్న పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకు, వృద్ధాప్య, వితంతువులకు పెంచిన రూ.3 వేలు అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ నరేంద్ర, కార్పొరేటర్లు మరుపిళ్ల రాజేష్, యలకల చలపతిరావు, అత్తులూరి ఆదిలక్ష్మి, మైలవరపు రత్నకుమారి, అర్షద్, మైలవరపు మాధురి లావణ్య, చైతన్యరెడ్డి, గోదావరి గంగ పాల్గొన్నారు.

సిటీ బస్సు సర్వీసుల రూట్ మళ్లింపు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణ సందర్భంగా పోలీసుల ఆంక్షలను అనుసరించి ఈ నెల 8వ తేదీ వరకు విద్యాధరపురం ఆర్టీసీ డిపో పరిధిలోని సిటీ సర్వీసులను రూట్ మళ్లించినట్లు డిపో మేనేజర్ కె.సుబ్రమణ్యేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రూట్ నంబర్ 11, 31 సర్వీసులు వైఎస్సార్ కాలనీ – పైపుల రోడ్ – సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా చల్లపల్లి బంగ్లా – పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్టాండ్ మీదుగా ఆటోనగర్, అదే విధంగా 5జె రూట్ సర్వీస్ వైఎస్సార్ కాలనీకి బదులుగా కాశేశ్వరరావు మార్కెట్ నుంచి ఆటోనగర్ వరకు, 218 సిటీ సర్వీస్ పీఎన్‌బీఎస్ నుంచి చల్లపల్లి బంగ్లా – సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా పైపుల రోడ్ ద్వారా జక్కంపూడి కాలనీ జంక్షన్ నుంచి మైలవరం వరకు మళ్లించామన్నారు. అలాగే 3వ నంబర్ రూట్ బస్ కబేళా నుంచి వంగవీటి మోహన్‌రంగా జంక్షన్ – భవానీపురం కనకదుర్గమ్మ ఫ్లై ఓవర్ మీదుగా పీఎన్‌బీఎస్ ద్వారా గవర్నమెంట్ ప్రెస్ వరకు, వన్‌టౌన్ పంజా సెంటర్ నుంచి 7టీ (2 బస్‌లు), తాడిగడప వరకు, 11జె(2 బస్‌లు) పంజా సెంటర్ నుంచి బందరు రోడ్ మీదుగా ఆటోనగర్, పంజా సెంటర్ నుంచి 31జె (2బస్‌లు) బందరు రోడ్ మీదుగా ఆటోనగర్, 3వ నెంబర్ (3బస్‌లు) పంజా సెంటర్ నుంచి గవర్నమెంట్ ప్రెస్ వరకు, 3డీ(1బస్) పంజా సెంటర్ నుంచి దేవీనగర్ వరకు ప్రయాణిస్తాయని తెలిపారు. ప్రయాణికులు గమనించి ఆయా రూట్‌ల మీదుగా ప్రయాణం చేయాలని కోరారు.

స్మృతివనం ముఖద్వారం పనులు త్వరగా పూర్తి చేయాలి



స్మృతివనం కారిడార్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అధికారులు

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు వేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. వైభవంగా నిర్మాణమవుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ముఖద్వారం దగ్గర ఉన్న కారిడార్ పనులు అత్యంత వేగవంతంగా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని చెప్పారు. టెర్రస్‌లో జరుగుతున్న సాండ్ స్టోన్, గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు త్వరగా శరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెయింటింగ్, ఉడ్ వర్క్ పనులు దగ్గరుండి పరిశీలించి పలు సూచనలు చేశారు. వారంలోపు పనులన్నీ పూర్తి కావాలన్నారు.

ఈ నెల 19వ తేదీన స్మృతివనాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించి, జాతికి అంకితమిస్తారని పేర్కొన్నారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు మేనేజర్, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

భవానీల రద్దీ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దీక్ష విరమణలకు భవానీలు భారీగా తరలివస్తున్న నేపథ్యంలో దేవస్థానానికి చెందిన ముఖ్య అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని దుర్గగుడి ఈవో కెఎస్.రామారావు ఆదేశించారు. దీక్ష విరమణల తొలి రోజైన బుధవారం పెద్ద ఎత్తున భవానీలు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో ఆలయ అధికారులు అప్రమత్తమయ్యారు. బుధవారం ఆలయ ఈవో కెఎస్.రామారావు చాంబర్‌లో ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఆలయ అర్చకులు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. రానున్న నాలుగు రోజులు ఇదే రీతిలో భవానీల రద్దీ కొనసాగే అవకాశం ఉండటంతో అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆలయంలో భవానీలకు అమ్మవారి దర్శనంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడటంతో పాటు త్వరితగతిన దర్శనం అయ్యేలా చూడాలన్నారు. ఇక క్యూలైన్లు, స్నానఘాట్లతో పాటు హోమగుండాల వద్ద, అన్న ప్రసాదం వితరణ, లడ్డూ విక్రయ కౌంటర్ల వద్ద సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ ఏదైనా ఇబ్బంది ఎదరయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఆలయ ఈఈ కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈవోలు ఎన్. రమేష్‌బాబు, చంద్రశేఖర్, ఆలయ అర్చకులు ఎల్‌డీ. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ముగ్గురమ్మల జాతర



ముగ్గురమ్మల ఆలయం వద్ద పూజలు చేసిన ఎమ్మెల్యే వెంకటకృష్ణప్రసాద్, శ్రీదేవి తదితరులు

దొనబండ(ఇబ్రహీంపట్నం): భక్తుల ఇలవేల్పుగా వెలుగొందుతున్న సత్తెమ్మ, మారెమ్మ, కాళియమ్మ (ముగ్గురమ్మల) ఆలయం జాతర దొనబండ గ్రామంలో బుధవారం కనుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ముగ్గురమ్మలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి, అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. భక్తులు వీపులకు శూలాలు గుచ్చుకుని కారును లాగి భక్తిని చాటారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ముగ్గురమ్మల ఆలయం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు జాతీయ రహదారి నుంచి ఎమ్మెల్యేకు మేళతాళాలతో సాదరస్వాగతం పలికి ర్యాలీగా తోడుకుని వెళ్లారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవార్ల కరుణాకటాక్షాలు ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచ్ డి.రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు ఎం.రంగస్వామి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొంతా సాంబశివరావు, పాలడుగు దుర్గాప్రసాద్, గరికపాటి రాంబాబు పాల్గొన్నారు.

డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



శ్రీనివాస్‌రెడ్డిని అభినందిస్తున్న కమిటీ సభ్యులు

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): డైమండ్ లోటస్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా పల్లేటి శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు. పూర్ణానందంపేటలోని ఓ హోటల్‌లో నూతన కమిటీ సభ్యుల పదవి ప్రమాణస్వీకరణ బుధవారం జరిగింది. జిల్లా 202 మాజీ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన పల్లేటి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి మాటూరి బసవయ్య, కోశాధికారి గుంటూరి దుర్గాప్రసాద్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం రామలింగరాజు మాట్లాడుతూ అందరూ ఐకమత్యంతో ఉంటేనే మహాబలమన్నారు. నడవండి, నడిపించండి, ఆరోగ్యంగా ఉండండి అని పిలుపునిచ్చారు. మాజీ అధ్యక్షుడు సాయిబాబా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తనకు అప్పగించిన బాధ్యతలను తన శక్తి మేరకు నిర్వహించానని తెలిపారు. క్యాబినెట్ సెక్రటరీ పీవీడీ ప్రసాద్ మాట్లాడుతూ నిత్యం వ్యాయమం చేయటం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్లు కారణంగా ప్రజలు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, జనార్దనసింగ్, మన్సూర్ పాల్గొన్నారు.

7న ఎస్ఆర్ఎస్వీ బీఈడీ కాలేజీ పూర్వ విద్యార్థుల సమావేశం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలోని ఎస్ఆర్ఎస్వీ కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ పూర్వ విద్యార్థుల సమావేశం ఈ నెల ఏడో తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి జి.గంగాధర్ తెలిపారు. సమావేశం పోస్టర్‌ను ఆ కళాశాల ప్రాంగణంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తమ కళాశాల 2007లో ప్రారంభించామన్నారు. బీఈడీ, డీఈడీ చదివిన విద్యార్థులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. తమ కళాశాలను గతంలో గాంధీనగర్ ప్రాంగణంలో ఉండేదని, 2022 నుంచి విజయవాడ వన్‌టౌన్ కేబీఎన్ కళాశాలలోని ఆలపాటి బ్లాక్‌లో మార్పు చేశామన్నారు. ఈ కళాశాల రీడింగ్ రూమ్‌లో ఏడో తేదీ ఈ సమావేశం జరుగుతుందన్నారు. కాలేజీ పూర్వ విద్యార్థులు చాలామంది డీఎస్సీ ద్వారా టీచర్స్‌గా ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. కాలేజీ లెక్చరర్స్‌గా మరికొందరు ఉద్యోగాలు పొందారన్నారు. కాలేజీ విద్యార్థులందరూ పూర్వ విద్యార్థుల సమావేశంలో పాల్గొనాలని కోరారు. జాయింట్ సెక్రటరీ ఎంవీకే హరగోపాల్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆకెళ్ల సూర్య కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ పి.స్వరూప పాల్గొన్నారు.

కళాశాలకు కంప్యూటర్లు అందజేత

మైలవరం: స్థానిక వీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సినీ నిర్మాత, మైలవరం ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్(మోస్ట్) జనరల్ సెక్రటరీ, బాపూజీ బోర్డ్ హైస్కూల్ పూర్వ విద్యార్థి జవ్వాజి వెంకట రామారావు తన సొంత నిధులతో కొనుగోలు చేసిన మూడు కంప్యూటర్‌లు కళాశాల ఒకేషనల్ విభాగానికి బుధవారం అందజేశారు. ప్రిన్సిపాల్ సరళకుమారి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.